
తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న పలువురు నేతలు

భక్తి శ్రద్ధలతో భారీ తొట్టెల ఊరేగింపు

కవాడిగూడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బోనాల పండగను పురస్కరించుకొని ప్రతి యేటా తొట్టెల బీర్ల నారాయణ స్వామి ఆధ్వర్యంలో భారీ తొట్టెల ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి నిర్వహించారు. లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని జలవాయి టవర్స్ సమీపంలో ఉన్న తన ఇంట్లో అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసి, ఊరేగింపును బ్యాండ్ మేళాలు, పోతరాజుల నృత్యాలతో ప్రారంభించారు. లోయర్ టాంక్‌బండ్ నుంచి బండమైసమ్మనగర్ అమ్మవారి దేవాలయంలో తొట్టెలను సమర్పించి, ఇందిరాపార్కు చౌరస్తా మీదుగా లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మ దేవావలయం, దోమగలగూడ గగన్‌మహల్‌లోని నల్లపోచమ్మ దేవాలయం, అడ్వకేట్ కాలనీలోని బాలదానమ్మ అమ్మవారి దేవాలయంలో మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా దోమలగూడ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బ్రాహ్మణుల హక్కుల సాధనకు భానుమూర్తి కృషి


భానుమూర్తి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘం నేతలు

నల్లకుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నాడు తెలంగాణ రాష్ట్రంలోని బ్రాహ్మణుల హక్కుల సాధనతో పాటు ఆలయాల అర్చక ఉద్యోగుల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పోరాడిన వ్యక్తి దివంగత గంగు భానుమూర్తి అని పలువురు కొనియాడారు. గంగు భానుమూర్తి జయంతి సందర్భంగా బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట డివిజన్‌లోని శివం రోడ్డులో ఆయన విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు గంగు కృష్ణచైతన్య అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణశర్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు తీరని అన్యాయం'

నల్లకుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలులో రాష్ట్రంలో మాల విద్యార్థి, యువకులకు కాలేజీ అడ్మిషన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో తీవ్రనష్టం జరుగుతోందని తెలంగాణ మాల సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కన్వీనర్ దామల్ల సర్వయ్య పేర్కొన్నారు. ఆదివారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నష్టాన్ని ఎదుర్కోవడానికి ప్రజాస్వామిక పోరాటాలతో మరోసారి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఆగస్టు 1న రాష్ట్రంలోని మాల సంఘాల జేఏసీ కార్యాచరణతో అన్ని కలెక్టర్లకు, ఎమ్మెల్యేలకు వినతిపత్రం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

ఆగస్టు 2 నుంచి 18 వరకు అమరులయాదిలో..

రాంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 2 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే అమరులయాదిలో సామాజిక చైతన్యయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ.వెంకటరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, భూపతి వెంకటేశ్వర్లు, లెల్లెల బాలకృష్ణ, వెంకటనర్సయ్య, రాజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్‌తేజ తదితరులు

ఊరు చివరి మనిషి పుస్తకావిష్కరణ

రాంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఊరు చివరి మనిషి పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, దియా పబ్లికేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ పుస్తకం జె.రాములు అనే ఒక దళిత సామాజిక వర్గానికి చెందిన ఓ పోలీసు ఆఫీసర్ ఆత్మకథ అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శిని టీవీ రమేష్, రచయిత డేవిడ్, గడ్డం సదానందం, పుస్తక రచయిత దియా విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా ఆర్టీసీ క్రాస్ రోడ్

చిక్కడపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్టీసీ క్రాస్‌రోడ్ కూడలి బురదమయంగా మారింది. రోడ్డుపై వరదనీరు నిలిచిపోవడంతో వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. క్రాస్‌రోడ్‌లోని హోటళ్లు, సినిమా థియేటర్‌ల వద్దకు వెళ్లే మలుపులో నీరు నిలిచిపోవడంతో వాహనాలు వెళ్లినప్పుడు మురికినీరు పాదచారులపై ఇతర వాహనాలపై పడుతోంది. బురద పేరుకుపోవడంతో వరదనీరు కచ్చానాలా లైన్‌లోకి సాఫీగా వెళ్లడంలేదు. చిక్కడపల్లి సుధా హోటల్ పక్కలేన్‌లో వాటర్‌బోర్డ్ మ్యాన్‌హోల్ మూత ఊడిపోవడంతో దాన్ని సరిచేయకుండా దానిచుట్టూ వాటర్‌బోర్డువారు బారికేడ్ ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

లైబ్రరీ నుంచి మమ్మల్ని వెళ్లగొట్టారు : నిరుద్యోగులు

చిక్కడపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని ప్రభుత్వ సంస్థ అయిన సిటీసెంట్రల్ లైబ్రరీలో పోటీపరీక్షల కోసం చదువుకుంటున్న నిరుద్యోగ విద్యార్థులను బయటకు వెళ్లగొట్టి, ఆదివారంవైద్యశిబిరం ఏర్పాటు చేయడానికి ప్రయివేట్‌సంస్థకు లైబ్రరీ అధికారులు అనుమతించారని పలువురు నిరుద్యోగ అభ్యర్థులు ఆరోపించారు. గతేడాది కూడా ఇదేవిధంగా చేశారని శంకర్‌నాయక్, లక్ష్మీకాంత్, వెంకటేష్, నరేష్, భాస్కర్, శ్రీనివాస్, శివ తదితరులు మండిపడ్డారు. లైబ్రరీ ఆవరణలో ఎంతో ఖాళీస్థలం ఉండగా చదువుకునే నిరుద్యోగ విద్యార్థులను వెళ్లగొట్టి లోపల వైద్యశిబిరం నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. శిబిరంలో పాల్గొన్న సిబ్బంది కోసం లైబ్రరీ లోపల ఉన్న ఖాళీస్థలంలో వంటలు చేశారని, దీనివల్ల లైబ్రరీ అంతా పొగ, వాసన వ్యాపించిందని వారు తెలిపారు. 'విద్యార్థులు నోటిఫికేషన్ గొంతు విప్పి అడిగితే పోలీస్‌కేసులు అవుతాయి. ఇది ధర్నాచౌక్ కాదు. బెదిరించే లైబ్రరీ అధికారులు లైబ్రరీని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించడం ఎంతవరకు సబబు' అని వారు ప్రశ్నించారు.

జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం

చిక్కడపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిభను ప్రశంసించడమే కాదు అనుభవానికి కూడా గౌరవం ఇవ్వాలని శాంతా బయోటెక్నిక్ లిమిటెడ్ అధినేత, పద్మభూషణ్ డా.కేఐ .వరప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొమర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవన సాఫల్య పురస్కారాల ప్రదానసభను సంస్థ ముఖ్య సభ్యులు కొమర్రాజు రవి పర్యవేక్షణలో నిర్వహించారు. 2024, 2025 సంవత్సరాలకు సంబంధించి సాహిత్యరంగంలో ఓలేటి పార్వతీశం, ఆచార్య తాడేపల్లి పతంజలి, విద్యారంగంలో ఆచార్య సీఆర్ విశ్వేశ్వరరావు, వింజమూరి బాలమురళికి వరప్రసాద్‌రెడ్డి పురస్కారాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పూర్వ వీసీ సీఆర్.విశ్వేశ్వరరావు, మా శర్మ, జితేంద్ర పాల్గొన్నారు.

రైలు ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగు తస్కరణ

బర్కత్‌పుర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. హరియాణా రాష్ట్రానికి చెందిన సునీతారాణి నగరానికి రావడానికి ఢిల్లీలోని హజరత్ నిజాముద్దీన్ రైల్వేస్టేషన్‌లో లగేజీ బ్యాగులను పార్సిల్ కార్యాలయంలో అప్పగించింది. దానిలోని హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదు. నగరానికి వచ్చిన తర్వాత ఆమె కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఆ హ్యాండ్ బ్యాగులో ఒక సెల్‌ఫోన్, ఏటీఎం, డెబిట్, ఆధార్, ఇన్సూరెన్స్ పత్రాలు ఉన్నాయి. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం హజరత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.


సుందరయ్యపార్కులో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ, వెంకటకృష్ణ తదితరులు


సుందరయ్యపార్కులో జరిగిన బోనాల వేడుకల్లో పాల్గొన్న రాంనగర్ కార్పొరేటర్ రవిచారి తదితరులు


బోనాల వేడుకల్లో పాల్గొన్న తెల్లఉప్పలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ వెంకటకృష్ణ తదితరులు

వైభవంగా శ్రావణమాసం బోనాలు

- సుందరయ్య పార్కులో తెల్లఉప్పలమ్మకు ప్రత్యేక పూజలు
- హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ రవిచారి


భూలక్ష్మీ దేవాలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు


అమ్మవారి ఆలయానికి బోనాలను తీసుకొస్తున్న మహిళలు

రాంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాలు ప్రతీకగా నిలుస్తున్నాయని ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులోని తెల్లఉప్పలమ్మ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటకృష్ణ (బబ్లూ) ఆధ్వర్యంలో శ్రావణ మాసం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాల పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. తెల్ల ఉప్పలమ్మ ఆలయంలో అనేక సంవత్సరాలుగా బోనాలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, ప్రతినిధులను వారు అభినందించారు. బోనాల వేడుకల్లో ప్రజాప్రతినిధులు పోతరాజులతో కలిసి స్టెప్పులు వేసి సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రజలు తెల్లఉప్పలమ్మకు బోనాలు సమర్పించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, ఆలయ కమిటీ ప్రధానకార్యదర్శి దామోదర్‌రెడ్డి, ప్రతినిధులు ఎంఎస్.రావు, రాజేంద్రప్రసాద్‌గౌడ్, ఆర్.వివేక్, శేఖర్, వెంకటస్వామి గౌడ్, జయదేవ్, నాగరాజు, కల్యాణ్‌నాయక్, నాగభూషణం, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్ రంగానగర్‌లో...

ముషీరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ రంగానగర్‌లో ఆదివారం శ్రావణమాస బోనాలు వైభవంగా కొనసాగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను తీసుకొచ్చి నల్లపోచమ్మ, భూలక్ష్మి దేవాలయాలలో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, సీనియర్ నాయకులు ముప్పిడి నర్సింగ్‌రావు, నాగేష్ తదితరులు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సాయంత్రం బ్యాండ్‌మేళాలతో తొట్టెలను ఊరేగించి, అమ్మవారి ఆలయంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్, రంగానగర్ యువజన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి వినోద్, కోశాధికారి ఎల్లేష్, నాయకులు మల్లేష్, రవికుమార్, నాగేష్, ధర్మేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మేదరబస్తీలో...

చిక్కడపల్లి: తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల ఉత్సవాలు అని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ జనరల్ బంటారం యాదగిరిగౌడ్, సీనియర్ కాంగ్రెస్ జి.జయేందర్‌బాబు అన్నారు. చిక్కడపల్లి మేదరబస్తీలో ఆదివారం ఘనంగా బోనాలను నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరిగౌడ్, జయేందర్‌బాబులు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సంస్థలతో తెలుగు సంస్కృతి పరిరక్షణ


డా.వంశీరామరాజు దంపతులను సన్మానిస్తున్న బండారు దత్తాత్రేయ

చిక్కడపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక సంస్థలతో తెలుగు సంస్కృతి పరిరక్షణ సాధ్యమని, 54 ఏళ్లుగా వంశీ సంస్థ ద్వారా వంశీ రామరాజు కళారంగానికిచేస్తున్న సేవ విశేషం అని హరియాణా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రశంసించారు. వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగానసభలో డా.వంశీ రామరాజు, సుధాదేవి దంపతులు వైవాహిక స్వర్ణోత్సవం ప్రముఖ వ్యాఖ్యాత్రి సుధామయి జన్మదిన సందర్భంగా తెలుగు పాటకు పట్టాభిషేకం పేరిట సినీ సంగీత విభావరి జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బండారు దత్తాత్రేయ రామరాజు దంపతులను, సుధామయిని సత్కరించారు. సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞశర్మ, సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ పాల్గొన్నారు.

కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి

బర్కత్‌పుర జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. కేన్సర్ పట్ల ప్రతిఒక్కరూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమాజంలో నిస్వార్థంగా పనిచేసే డాక్టర్లను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డాక్టర్ శోభ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ తెలంగాణ పీపీఎస్ వైద్య విభాగ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బర్కత్‌పురలోని హరికిషన్ ఐ కేర్ లేజర్ సెంటర్‌లో నిర్వహించిన స్క్రీనింగ్ మెగాహెల్త్ క్యాంపునకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా సేవలందించిన వైద్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, టీపీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణుమూర్తి, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ సమత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవంతో జీవించే సమాజం ఏర్పడాలి


మాట్లాడుతున్న మాడభూషి శ్రీధర్, పక్కన మాజీ ఎమ్మెల్యే నర్సయ్య

రాంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): యువకులు ఆత్మగౌరవంతో జీవించగలిగే సామాజిక ఆర్థిక పరిస్థితులు గల సమాజం ఏర్పడాలని కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యువకులు కనీస అవసరాలు కూడా తీరలేని పనులతో నలిగిపోతూ, ఆత్మగౌరవంతో వ్యవహరించలేని సామాజిక పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మద్యం, మత్తు, మూఢనమ్మకాల వంటి విష వలయాలు యువతను పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. వీటిని ఛేదిచి యువకులు సమాజం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ యువకులకు ఉపాధి, ఉద్యోగం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికల్లో యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. యువత సమస్యలపై పీవైఎల్ పోరాడాలన్నారు. ఈ కార్యక్రమానికి పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్ జెండా ఆవిష్కరించి సమావేశాన్ని ప్రారంభించారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుల ఎం.హన్మేష్, టీయుసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్.పద్మ, రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప, పీవైఎల్ నాయకులు రవికుమార్, ఈశ్వర్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కులాలను బీసీ జాబితాలో చేర్చాలి

పంజాగుట్ట, జూలై 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీ జాబితా నుంచి తొలగించిన 27 కులాలను తిరిగి చేర్చాలని తెలంగాణ 27 కులాల బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు మీరాకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం 2014లో జీఓ నంబర్ 3 ద్వారా 27 కులాలను జాబితా తొలగించిందన్నారు. నాటి నుంచి నేటివరకు ప్రభుత్వానికి అనేకసార్లు వినతిపత్రాలు అందించామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ఎక్కడా ఈ ప్రస్తావన తీసుకురావడం లేదన్నారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని సరిచేయాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల జనాభా ఉన్న తమ కులాలను లెక్కించకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు అప్పారావు, భాస్కర్, రమ్యశ్రీ, వెంకట్ రాజు, సాయికృష్ణ, వెంకటరమణ, జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


వైద్య శిబిరంలో ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ అమృత

నల్లకుంట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు పేదప్రజలకు వైద్యం అందించడానికి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. ఆదివారం నల్లకుంట డివిజన్ న్యూనల్లకుంటలోని కొత్త రామాలయం కమ్యూనిటీహాల్‌లో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఉచితమెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత హాజరై, వైద్య శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలకు సంపూర్ణమైన ఆరోగ్యం కల్పించేందుకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ వైద్యశిబిరంలో పరిసర ప్రాంతాల ప్రజలకు విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి వైద్యనిపుణులు వైద్య చికిత్సలు అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ప్రతినిధులు గంగు కృష్ణచైతన్య, శిరీష్, ప్రశాంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

రాంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉచితవైద్య శిబిరాలను పేదప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని వైభవ్‌నగర్‌లో గల సీజన్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచితమెగా వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్య వృత్తి సేవాభావంతో కూడుకున్నదని, దానిని దృష్టిలో పెట్టుకుని వైద్యులు ప్రజలకు ఉచిత వైద్య సేవలందించాలన్నారు. సీజన్స్ ఆస్పత్రి తరచూ ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, పేదలకు వైద్య చికిత్సలు కల్పించడం పట్ల ఆస్పత్రి ఎండీ దేవేందర్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ, డాక్టర్ హరిచరణ్, శ్రీనివాస్, క్రాంతి, అశ్విని, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'సివిల్స్‌లో తెలుగును ప్రత్యేకంగా తీసుకునేలా కృషి'

రాంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీస్‌లో కూడా తెలుగును ప్రత్యేకంగా తీసుకుని సెలెక్ట్ అయ్యేవిధంగా పాఠ్యప్రణాళిక సిద్ధపరచి అమలు చేసే విధంగా కృషిచేస్తున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ఆచార్య పురుషోత్తమ్ తెలిపారు. ఆదివారం విద్యానగర్‌లోని స్వామి వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాల దాశరథి - సినారె సాహిత్య సమాలోచన కార్యక్రమం తెలంగాణ సాహిత్య అకాడమి, తెలుగు భాష చైతన్య సమితి, తెలుగు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి నామోజు బాలచారి, ప్రముఖ కవి రామకృష్ణ చంద్రమౌళి, తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షుడు పి.బడేసాబ్, తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి, ఎల్.విజయ, గంట మనోహర్‌రెడ్డి, అర్ధచంద్ర ప్రకాష్‌రెడ్డి, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ యేడ్ల కల్లేష్, డాక్టర్ విజయప్రకాష్, నక్కా శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్, ప్రజ్ఞారాజు, రాధాకుసుమ, పాలడుగు సరోజినిదేవి, దాసోజు పద్మావతి, సునంద పాల్గొన్నారు.

వృద్ధ కళాకారులకు రూ.25వేల విరాళం

చిక్కడపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత దేశంలో త్వరలో దేశంలో ఐదు భాషల్లో విడుదల కానున్న త్రిబాణధారి బార్బరిక్ చిత్ర యూనిట్‌ను త్యాగరాయ గానసభలో ఆదివారం సత్కరించారు. రాగం మ్యూజిక్, డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వర్ణకమలం అవార్డ్ ప్రదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి నాట్యగురువు లతామోహన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా నిర్మాత అడిదల విజయపాల్‌రెడ్డి, దర్శకుడు మోహన్ శ్రీవాత్సవ హాజరయ్యారు. ఈ సందర్భంగా వృద్ధ కళాకారులకు పాతిక వేల రూపాయల విరాళాన్ని నిర్మాత ప్రకటించారు. కార్యక్రమంలో అతిథులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండువందల మంది నృత్య కళాకారులు, గాయనీగాయకులు తమ ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు పొందారు.

విద్యార్థులు బాగా చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్

ముషీరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని లయన్స్ క్లబ్ నవభారత్ అధ్యక్షురాలు స్వరూపారాణి సూచించారు. ఆదివారం దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ వర్ధంతిని పురస్కరించుకుని లయన్స్ నవభారత్, వనిత భారత్ సంయుక్త ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో విద్యార్థినులకు పుస్తకాలు, శానిటరీ న్యాపికిన్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్వరూపారాణి మాట్లాడుతూ... అబ్దుల్ కలామ్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని దేశ సేవలో భాగస్వామ్యం కావాలన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలన్నారు. పేదలకు చేయూతనిచ్చేందుకు ప్రతి ఒక్కరూ మానవత దృక్పథంతో ముందుకు రావాలన్నారు. లయన్స్‌క్లబ్ నవభారత్, వనితా భారత్ పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు.

'రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే'

ముషీరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ఆ పార్టీ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్‌లో డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆకుల అరుణ్ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని అభినందిస్తూ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముఠా జైసింహ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్య వంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్స్

ముషీరాబాద్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని ఆశీర్‌ఖానా దర్గా ఉర్స్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పీర్లకు దట్టీలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. స్థానికులతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లింలు, హిందూవులు హాజరై ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా భారీబహిరంగ సభను సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్‌చారి, టెంట్‌హౌస్ శ్రీనివాస్, డివిజన్ ఉపాధ్యక్షుడు మోహిన్, బల్లా ప్రశాంత్, ముషీరాబాద్ సీఐ రాంబాబు, డీఐ నదీంహుస్సేన్, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలి : ఎస్‌వీకే

రాంనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ వివాహాలను ప్రభుత్వం, పౌర సమాజం ప్రోత్సహించాలని ఎస్‌వీకే కార్యదర్శి, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్.వినయ్‌కుమార్ సూచించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటి, సుందరయ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎల్లికంటి కీర్తి, అక్కి ప్రశాంత్ ఆదర్శ వివాహం జరిగింది. టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్.వినయ్‌కుమార్, కేవీపీఎస్ ప్రధానకార్యదర్శి స్కైలాబ్‌బాబు పాల్గొని, ఆదర్శ వివాహం జరిపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన నాయకులు శ్రీరాంనాయక్, నాయకులు విజయ్‌కుమార్, డి.కిరణ్, అశోక్‌రెడ్డి, శ్యామ్‌కుమార్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, గోవర్ధన్, వధూవరుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.